క్లుప్తంగా

జనమంతా జగన్ వెంటే


మాట్లాడుతున్న మక్బూల్ అహ్మద్

కదిరి: 'ప్రజలు చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మి 2014లో సైకిల్‌కు ఓటేసి మోసపోయారు. తర్వాత జగనన్న పాలనను చూశారు. అందుకే ఈసారి చంద్రబాబు అబద్ధపు హామీలు నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరు. జనం ఆయన కన్నా తెలివైన వారన్న విషయం చంద్రబాబుతో పాటు ఆ పార్టీ నాయకులు తెలుసుకోలేక పోతున్నారు. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా జనం మళ్లీ జగన్ వైపు చూస్తున్నారు. ఆయన వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని జనం నమ్ముతున్నారు' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ తెలిపారు. ఆదివారం ఆయన తమ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జగనన్నను గెలిపిస్తే గతంలో కంటే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తారని ప్రజలు నమ్ముతున్నారన్నారు. 'కదిరి నియోజకవర్గంలో ఎంతోమందికి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారు. ఈసారి నాకు ఒక్క అవకాశం కల్పిస్తే నియోజకవర్గ అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తా..' అన్నారు. ఓటు వేసే ముందు ప్రతి ఓటరు మంచి అభ్యర్థి ఎవరో ఒక్క క్షణం ఆలోచించి ఓటు వేస్తే కదిరి ప్రశాంతంగా ఉంటుందని సూచించారు. 'నేను కబ్జాలు. రౌడీయిజం చేయను. వ్యాపారులను బెదిరించను. పేదల ఆస్తులు ఆక్రమించను. నాపై ఎలాంటి కేసులు లేవు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ ఇలా అన్ని వర్గాల ప్రజలూ కలిసి మెలిసి ప్రశాంతంగా ఉండాలనేది నా కోరిక' అని తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమానికే పట్టం!

- ఐదేళ్లలో 94 శాతం మంది పేదలకు రూ.3,200 కోట్ల సంక్షేమం
- రూ.5వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిన వైఎస్సార్‌సీపీ
- నిత్యం అందుబాటులో ఉండే కేతిరెడ్డికే ప్రజల సంపూర్ణ మద్దతు
- నాన్‌లోకల్, బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌కు ప్రజలలో స్పందన కరువు
- నెలరోజుల్లో సత్యకుమార్ గిమ్మిక్కులను చీదరించుకుంటున్న జనం




ధర్మవరం-పుట్టపర్తి ప్రధానరోడ్డు పక్కనే పోతులనాగేపల్లి వద్ద వెలసిన జగనన్న లే అవుట్



ధర్మవరం: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా అభివృద్ధికే పట్టం కట్టనున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో పార్టీల కతీతంగా ప్రాంతాల కతీతంగా సాచురేషన్ పద్ధతిలో అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధికి ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమంతో నిత్యం ప్రజలతో మమేకమవుతూ ఎమ్మెల్యే కేతిరెడ్డి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. కేతిరెడ్డిని ఢీకొట్టేందుకు నియోజకవర్గంలో వరదాపురం సూరి, పరిటాల శ్రీరాంలు పోటీ పడ్డారు. అయితే అనూహ్యంగా నాన్‌లోకల్ వ్యక్తి అయిన సత్యకుమార్ బీజేపీ తరఫున బరిలోకి వచ్చారు. నెల రోజుల్లోనే సత్యకుమార్ చేసిన గిమ్మిక్కులను చూసి ప్రజలు చీదరించుకుంటున్నట్లుగా తెలుస్తోంది.

చరిత్రలో ఎన్నడూలేనంతగా సంక్షేమం, అభివృద్ధి

ధర్మవరం చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి రికార్డు సృష్టించారు. నవరత్నాల పథకాలను సాచురేషన్ పద్ధతిలో నియోజకవర్గంలో 94 శాతం మంది పేదలకు రూ.3,200 కోట్ల నిధులను డీబీటీలో జమ చేశారు. ఇది రాష్ట్ర చరిత్రలోనే అరుదైన రికార్డు. మరో వైపు నియోజకవర్గంలో అయిదేళ్లలో రూ.5వేల కోట్లకు పైగానే అభివృద్ధి పనులు చేపట్టడం. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడంతో ఓటర్లు కేతిరెడ్డివైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

కేతిరెడ్డికి కలసి వచ్చే అంశాలు

- ధర్మవరంలో గుడ్‌మార్నింగ్. కార్యక్రమం నిర్వహిస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి సంక్షేమ పథకాలను అందించడం
- కేతిరెడ్డి ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన అయిదేళ్లలో ధర్మవరం పట్టణంలో అత్యాధునిక సౌకర్యాలతో మదర్ అండ్ చైల్డ్‌సుపత్రి,
- ప్రతి 30 వేల జనాభాకు ఒకటి చొప్పున ఒక అర్బన్‌హెల్త్ సెంటర్ల 6 ఆసుపత్రులు,
- పట్టణ ప్రధాన వీధుల్లో షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం, పట్టణానికి చేరువలో 14 వేల మంది నిరుపేదలకు జగనన్న కాలనీల్లో ఇళ్లు
- నేతన్న నేస్తం పథకం ద్వారా చేనేత కార్మికులకు ఏటా రూ.24 వేలు పంపిణీ, కదిరి గేట్ రైల్వే ఓవర్ బ్రిడ్జి వంటి అభివృద్ధి పనులు

ఎన్డీఏ అభ్యర్థి సత్యకుమార్‌కు ప్రతికూల అంశాలు

- ఎన్డీఏ అభ్యర్థి సత్యకుమార్ వచ్చిన నెల రోజుల వ్యవధిలోనే బీసీ కార్డుతో ప్రచారం మొదలు పెట్టారు. అయితే ఆయన యాదవ సామాజికవర్గం కాదని సోషల్ మీడియాలో ఆధారలతో సహా తేటతెల్లమైంది.
- బీసీ కార్డు పనిచేయకపోవడంతో సినీనటులు సాయికుమార్, నారారోహిత్, నమితలతో ప్రచారం చేయించారు. అయినప్పటికీ ప్రజల నుంచి స్పందన కరువైంది.
- చివరకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను పట్టణానికి రప్పించి ప్రచారం చేయించారు. చేసే అభివృద్ధిని చెప్పకుండా పట్టుచీరల వ్యాపారులను బీజేపీకి మద్దతు తెలపాలని లేకుంటే సీబీఐ, ఈడీ పేరుతో బెదిరించారు.
- ఢిల్లీ స్థాయి నాయకుడని చెబుతూ చేనేత జీఎస్టీ రద్దుపైన కేంద్రం నుంచి కనీసం ఒక్క ప్రకటన కూడా చేయించక పోవడంతో ప్రజల్లో చులకనయ్యారు.
- ఎన్నికల తర్వాత సత్యకుమార్ ఎక్కడుంటాడో తెలియని పరిస్థితి. దీంతో నియోజకవర్గ ప్రజలు ఆయన అభ్యర్థిత్వంపై ఆసక్తి చూపడం లేదు.

కందికుంటకు ఓటేస్తే ఇక అంతే


మాట్లాడుతున్న మాజీ మంత్రి షాకీర్

కదిరి: 'టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్‌కు దయచేసి ఎవ్వరూ ఓటు వేయొద్దు. ఆయనకు ఓటేస్తే ఇక అంతే' అని మాజీ మంత్రి మహమ్మద్ షాకీర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన తన స్వగృహంలో మీడియాతో మాట్లాడారు. 2014 ఎన్నికల్లో కందికుంట ఓడిపోతే 'ముస్లింలు ఒక్క నా కొడుకు నాకు ఓటు వేయలేదు.. అని కందికుంట అన్న మాటలు ప్రతి ముస్లిం మదిలో మెదులుతున్నాయన్నారు. వలీసాబ్‌రోడ్‌లోకొచ్చి 'ఒరేయ్..ఇదేమైనా పాకిస్థానా..ఎక్కువగా మాట్లాడితే మిమ్మల్ని పాకిస్థాన్‌కే తరిమేస్తా..' అని ఆయన చెప్పిన మాటలు ఎలా మరచిపోతాం..అని షాకీర్ తెలియజేశారు. కదిరి-హిందూపురం రోడ్‌లో వీవర్స్ కాలనీ వద్ద పేద ముస్లింలకు చెందిన 3 ఎకరాల స్థలాన్ని కబ్జా చేసి, దానికి నకిలీ పత్రాలు సృష్టించి, ఆ స్థలం చుట్టూ కంచె వేసిన విషయాన్ని ప్రతి ముస్లింను కలిచివేస్తోందన్నారు. కందికుంటను గెలిపిస్తే కబ్జాలకు సహకరించినట్లేనని ఆయన హెచ్చరించారు. 'పైసా పైసా పోగుచేసి 3 సెంట్లు భూమి కొనుగోలు చేస్తే అలాంటి స్థలాలను కందికుంట,ఆయన అనుచరులు కబ్జాలు చేస్తున్నారు.. ఈసారి ఆయనను గెలిపిస్తే కదిరిలో ఆయన వర్గీయులు అరాచకం సృష్టించడం ఖాయం' అని హెచ్చరించారు. పట్టణంలో ప్రతి దుకాణం నుంచి వారు నెల మామూళ్లు వసూలు ఖాయమన్నారు. హిందూ,ముస్లింలు కదిరిలో కలిసిమెలిసి జీవిస్తున్నారని, ఇలాంటి చోట ఆయన 2014 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత అన్న మాటలు ప్రతి ఒక్కరినీ కలిచి వేశాయన్నారు. ప్రతి ఒక్కరూ ఈ విషయం గుర్తుంచుకొని, అందరూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి బీఎస్‌మక్బూల్‌ను గెలిపించాలని కోరారు.

రాప్తాడులో చల్లని 'గాలి'!

- ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి విజయం ఖాయం!
- వైఎస్సార్‌సీపీ పథకాలు గెలిపిస్తాయని చెబుతున్న విశ్లేషకులు





కనగానపల్లి: రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గెలుపు ఖాయమని విశ్లేషకులు చెబుతున్నారు. 2019 ఎన్నికల్లో 25,575 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందిన ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ఈసారి మరింత ఎక్కువ మెజారిటీతో గెలుపొందే అవకాశాలు పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తోంది. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు ఉమ్మడి అసెంబ్లీ నియోజకవర్గంగా రాప్తాడు ఉంది. ప్రస్తుతం ఈ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 13 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా.. వారిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి పరిటాల సునీత మధ్య ప్రధాన పోటీ కనిపిస్తోంది. పోటీలో ఉన్న మిగిలిన అభ్యర్థుల్లో కాంగ్రెస్, బీఎస్పీలతో పాటు ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో టీడీపీకి రెబల్‌గా దిగిన స్వతంత్ర అభ్యర్థి ప్రొఫెసర్ రాజేష్‌తో టీడీపీ ఓట్లు చీలనున్నాయి.

అభివృద్ధికి బాటలు వేసిన తోపుదుర్తి

గతంలో అత్యంత వెనుకబడిన నియోజకవర్గంగా ఉన్న రాప్తాడులో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. నియోజకవర్గాన్ని ఫ్యాక్షన్ కు దూరంగా అభివృద్ధి వైపు నడిస్తున్నారు. ఈ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మూడు సార్లు పోటీ చేసిన ఈయన రెండు సార్లు ఓడిపోయినా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. ప్రజల పక్షానే పని చేస్తూ వస్తున్నారు. దీంతో 2019లో ప్రకాష్‌రెడ్డిని నియోజకవర్గ ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించారు.

నియోజకవర్గంలో ప్రకాష్‌రెడ్డి చేపట్టిన కార్యక్రమాలు

- గతంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వంద రోజుల లోపల హంద్రీనీవా ద్వారా పేరూరు డ్యాం నింపారు. నియోజకవర్గంలోని 90 శాతం చెరువులు నింపి రైతులకు సాగునీరందించారు.
- లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో నియోజక వర్గంలో నాలుగు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సీఎం జగన్ ద్వారా పనులు ప్రారంభించారు
- రైతులకు సాగునీటి కల్పన కోసం వైఎస్సార్ జలకళ పథకంతో పాటు నియోజకవర్గంలో తన సొంత నిధులతో ఆరు వేల మంది రైతులకు ఉచితంగా బోర్లు వేయించారు.
- రామగిరిలో బంగారు గనుల పునః ప్రారంభానికి చర్యలు ప్రభుత్వ అనుమతి
- నియోజకవర్గంలోని తాగునీటి కోసం పీఏబీఆర్ కాలువ నుంచి రూ.110 కోట్లతో పైపులైన్ పనులు
- రూ.20 కోట్లతో అమ్మ డైయిరీని ప్రారంభం. 10 వేల మంది మహిళా పాడి రైతులకు డెయిరీ అంకితం
- నియోజక వర్గంలోని 25 వేల మంది మహిళలకు ఇళ్ల పట్టాలతో పాటు 17 వేల మంది పేదలకు ఇళ్ల మంజూరు
- సూమారు 48 వేల మందికి సామాజిక పింఛన్ల పంపిణీ
- ఐదేళ్లలో సుమారు రూ.1,100 కోట్లు పేదలకు పంపిణీ

రెబల్ అభ్యర్థితో టీడీపీ ఓట్లకు దెబ్బ

రాప్తాడు నియోజకవర్గంలో నుంచి టీడీపీ రెబల్‌గా స్వతంత్ర అభ్యర్థి ప్రొఫెసర్ రాజేష్ పోటీ చేస్తున్నారు. బీసీ వాల్మీకి వర్గానికి చెందిన ఇతడి వల్ల టీడీపీ అభ్యర్థి పరిటాల సునీత ఓట్లకు భారీగా గండిపడే అవకాశం ఉందని తెలుస్తోంది. వాల్మీకులు ఎక్కువగా ఉన్న రామగిరి, కనగానపల్లి, రాప్తాడు మండలాల్లో అతను ఎక్కువగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ పరిటాల సునీతకు దెబ్బతీస్తున్నారు. దీనికి తోడు ధర్మవరం అసెంబ్లీ టిక్కెట్ దక్కకుండా చేశారన్న ఉద్దేశంతో వరదాపురం సూరి కూడా పరిటాల సునీత ఓటమికి లోలోపల అతడికి మద్దతు ఇస్తున్నట్లు సమాచారం. ఓటర్లకు ఎంత డబ్బు ఎర చూపినా ఈ ఎన్నికల్లో పరిటాల సునీతకు ఓటమి తప్పదని నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారు.

నేడే 'సార్వత్రిక' పోలింగ్

కదిరి నియోజకవర్గంలో
మొత్తం ఓటర్లు 2,53.420 మంది
పురుషులు: 1,24,650 మంది
మహిళలు: 1,28,762 మంది
మొత్తం పోలింగ్ కేంద్రాలు: 281

కదిరి: సార్వత్రిక ఎన్నికలకు కదిరి నియోజకవర్గంలో పోలింగ్ సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభం కానుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సన్నీ వంశీ క్రిష్ణ 'సాక్షి'కి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం ఎన్నికల అధికారులు, సిబ్బందికి పోలింగ్‌కు సంబంధించిన ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామాగ్రి అప్పగించారు. ఆ సమయంలో అక్కడ జోరుగా వర్షం పడటంతో ఎన్నికల సిబ్బంది మొత్తం తడిసి ముద్దయ్యారు. అక్కడి నుంచి వారిని వివిధ వాహనాల ద్వారా ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ప్రతి వాహనానికి జీపీఎస్ అమర్చారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి సన్నీ వంశీక్రిష్ణ మీడియాతో మాట్లాడారు. ఎన్నికల పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభించి సాయంత్రం 6 గంటల వరకూ నిర్వహిస్తామని తెలియజేశారు. అయితే ఉదయం 5.30 గంటలకే ఆయా పార్టీల ఏజెంట్ల సమక్షంలో మొదట మాక్ పోలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. ఆయా పార్టీల ఏజెంట్లు ఆ సమయానికే అక్కడికి చేరుకోవాలన్నారు. ఒకవేళ మాక్‌పోలింగ్ సమయానికి ఏజెంట్లు రాకపోతే వారి కోసం కేవలం 15 నిమిషాలు మాత్రమే ఎదురు చూడాలని ఎన్నికల అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ సమయం ముగిసినప్పటికీ ఆ సమయంలో క్యూలో ఉన్న ఓటర్లందరికీ తమ ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తామని తెలియజేశారు.

మహిళా ఓటర్లే అధికం

నియోజకవర్గంలో 2019 సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 2,39,867 మంది ఓటర్లు ఉండగా ఈసారి ఆ సంఖ్య 2,53,420 మందికి చేరింది. వీరిలో పురుషులు 1,24,650 మంది ఉండగా, మహిళలు 1,28,762 మంది, ఇతరులు 8 మంది ఉన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువగా ఉంది. ఈసారి నియోజకవర్గంలో ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులతో కలిపి 13 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న బి.ఎస్.మక్బూల్ అహ్మద్, టీడీపీ అభ్యర్థి కందికంట వెంకట ప్రసాద్‌ల మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అయితే కందికుంట అధికారంలో లేకపోయినా ఆయన చేసిన దౌర్జన్యాలు, భూకబ్జాల కారణంగా ఓటమి తప్పదని వారు చెబుతున్నారు. సౌమ్యుడైన మక్బూల్‌ను ఎన్నుకుంటే నియోజకవర్గ అభివృద్ధి జరుగుతుందని ఓటర్లు భావిస్తున్నట్లు రాజకీయ పండితులు చెబుతున్నారు.

144 సెక్షన్ అమలు

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కదిరి నియోజవర్గంలో 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు కదిరి డీఎస్పీ శ్రీలత తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 281 పోలింగ్ కేంద్రాలు ఉండగా వీటిలో 46 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించినట్లు కదిరి డీఎస్పీ తెలిపారు. పోలింగ్ కేంద్రంలో గానీ, లేదంటే పోలింగ్ కేంద్రం వద్ద గానీ ఎవరైనా అల్లర్లకు పాల్పడినే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు.

సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాలతో పర్యవేక్షణ

బత్తలపల్లి: అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా కేంద్ర బలగాలతో పర్యవేక్షించనున్నట్లు ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు, బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. రూరల్ సర్కిల్‌లో 12, బత్తలపల్లి పరిధిలో మాల్యవంతం, ఈదుల ముష్టూరు, పోట్లమర్రి, బత్తలపల్లి, అప్పరాచెరువు, డి.చెర్లోపల్లి గ్రామాలను అత్యంత సమస్యాత్మక గ్రామాలు గుర్తించామన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, ఓటర్లు సజావుగా ఎన్నికలు జరగడానికి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించండి

బత్తలపల్లి: వైఎస్సార్ సీపీ అభ్యర్థుల ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని ఎంపీపీ బగ్గిరి త్రివేణి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొల్లపల్లి రామకృష్టారెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గసభ్యులు కమతం ఈశ్వరయ్య, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి కోరారు. ఆదివారం వారు బత్తలపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి,బోయ శాంతమ్మల గుర్తు 'ఫ్యాను'కు ఓటు వేయాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి వైఎస్సార్‌సీపీ తోనే సాధ్యమవుతుందన్నారు. వైస్ ఎంపీపీలు గజ్జల వెంగళరెడ్డి, సాకే పార్వతి, కోఆప్షన్ మెంబర్ కరీంసాబ్, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్, డైరెక్టర్ ఈడిగ కాశప్ప, మండల నాయకులు గుర్రం నరసింహారెడ్డి, ముష్టూరు నరసింహారెడ్డి, బాబాజాన్, షేక్షావలి, జక్రీయా, టైలర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం

- పోలింగ్ కేంద్రాలకు తరలిన ఈవీఎంలు
- 290 పోలింగ్‌కేంద్రాలకు ఎన్నికల సామగ్రితోపాటు అధికారులు


ఎన్నికల సామాగ్రిని తీసుకెళుతున్న ఎన్నికల అధికారులు

ధర్మవరం అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు ధర్మవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. పట్టణంలోని మార్కెట్‌యార్డులో ఆదివారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట శివరామిరెడ్డి సమక్షంలో ఎన్నికల విధులు నిర్వహించేందుకు వచ్చిన అధికారులకు ఆయా పోలింగ్ స్టేషన్లను కేటాయించారు. మార్కెట్ యార్డును ఎన్నికల అబ్జర్వర్ రిథమ్ బార్డా పరిశీలించారు. అనంతరం ప్రత్యేక కౌంటర్ల వద్దకు వెళ్లి ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, ఎలక్షన్ మెటీరియల్‌ను ఎన్నికల అధికారులు తీసుకున్నారు. ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్ కేంద్రాలకు కావాల్సిన సామగ్రిని తీసుకుని అక్కడే పరిశీలించారు. రిటర్నింగ్ అధికారి సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై సూచనలు, సలహాలు అందించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 290 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలను నిర్వహించడం జరుగుతోంది. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఆరుగురు అధికారులతో కలిపి మొత్తం 1,740 మంది అధికారులు ఎన్నికల విధులకు హాజరయ్యారు. అదనంగా 50 మంది పీఓలు, 50 మంది ఏపీఓలు, 200 మంది ఓపీఓలు రిజర్వ్‌లో ఉన్నారు. దీంతో ఎన్నికల విధుల్లో 2040 మంది ఉద్యోగులు ఉన్నారు. అదనంగా 45 మంది మైక్రో అబ్జర్వర్లు, 35 సెక్టార్ ఆఫీసర్లు, 35 మంది రూట్ ఆఫీసర్లు తోపాటు భద్రతకు స్ట్రైకింగ్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు 92 వాహనాలను ఏర్పాటు చేశారు. ప్రతి వాహనానికి జీపీఎస్ ద్వారా ట్రాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశామని రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఎన్నికలు ముగిసిన అనంతరం ఈవీఎంలు, వీవీప్యాట్ మిషన్‌లను లేపాక్షి వద్దనున్న కౌంటింగ్ కేంద్రానికి తరలించే వరకు పటిష్ట పోలీసు బందోబస్తు నడుమ తరలిస్తామని తెలిపారు. పీఓలు, ఏపీఓలు ఇతర ఎన్నికల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా మార్కెట్‌యార్డులో కౌంటర్లను ఏర్పాటు చేసి వారికి ఎన్నికల సామగ్రితోపాటు ఈవీఎంలు, వీవీప్యాట్‌లు అందించారు. పోలింగ్ కేంద్రాల రూట్‌లకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ, ప్రైవేటు, స్కూల్ బస్సులలో ఎన్నికల నిర్వహణ అధికారులు, పోలింగ్ కేంద్రాల అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాలకు బయలుదేరి వెళ్లారు. అధికారులకు మార్కెట్‌యార్డు లోనే భోజన సదుపాయం కల్పించారు.

పోలింగ్ కేంద్రాలకు పోలీసుల బందోబస్తు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సర్కిల్ స్ట్రైకింగ్ ఫోర్స్, క్విక్ రియాక్షన్ ఫోర్స్, స్పెషల్ ఫోర్స్‌తోపాటు ఐపీఎస్ అధికారులు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతోపాటు వందలాది మంది పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్, టూటౌన్ సీఐలు సుబ్రహ్మణ్యం, అశోక్‌కుమార్ తెలిపారు. ఎలాంటి గొడవలు, ఘర్షణలకు దిగినా చట్టరిత్యా చర్యలు తప్పవన్నారు.

నియోజకవర్గం: ధర్మవరం

- మండలాలు: ధర్మవరం టౌన్, ధర్మవరం రూరల్, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ
- నియోజకవర్గ ఓటర్లు: 2,45,758
- పురుషులు: 1,21,764
- మహిళలు: 1,23,974
- ఇతరులు : 20
- పోలింగ్ బూత్‌లు: 290
- ఎన్నికల విధులకు అధికారులు నియామకం: 2040
- మైక్రో అబ్జర్వర్లు: 45
- సెక్టార్ ఆఫీసర్లు: 35
- రూట్ ఆఫీసర్లు : 35
- ఎన్నికల అధికారులను తరలించేందుకు వాహనాలు: 92